# 40 కిలోమీటర్ల దూరం..
# 40 నిమిషాల్లోనే!

- శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీకి మెట్రోరైల్ విస్తరణ
- ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం
- మెట్రో రైల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి ప్రకటన



ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి త్వరితగతిన, సులభంగా ఫ్యూచర్ సిటీకి చేరుకునే విధంగా హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరనణ పనులకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఎం.డి ఎన్.వి.ఎస్.రెడ్డి తెలిపారు. నార్త్ సిటీ లోని మేడ్చల్, శామీర్‌పేట్ కారిడార్లతో పాటు, ఫ్యూచర్ సిటీ మెట్రో కారిడార్ డిపిఆర్‌లను మార్చి నెలాఖరు వరకు పూర్తి చేసి, రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని చెప్పారు. దాదాపు పదిహేను వేల ఎకరాలలో విస్తరించనున్న 'భవిష్యనగరిని'(ఫ్యూచర్ సిటీ) కాలుష్యరహిత నగరంగా రూపొందించేందుకు అంతర్జాతీయ స్థాయి ప్రయాణ సౌకర్యాలను కల్పించడంలో మెట్రో రైలుతో కూడిన గ్రీన్ కారిడార్ ప్రముఖ పాత్ర వహిస్తుందన్నారు. ఎయిర్ పోర్ట్ నుండి మీర్ ఖాన్ పేట్‌లో నిర్మాణంలో ఉన్న స్కిల్స్ యూనివర్సిటీ వరకు మెట్రో కారిడార్ డిపిఆర్ రూపకల్పనలో భాగంగా జరుగుతున్న సర్వే పనులను మెట్రో ఎండి ఆదివారం పరిశీలించారు. కొంగర కలాన్ దాటిన తరువాత ప్రస్తుతం రోడ్ లేకపోవడంతో కాలినడకన పర్యటించి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్‌విఎస్.రెడ్డి మాట్లాడుతూ శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుండి ఫ్యూచర్ సిటీకి వెళ్లే మెట్రో మార్గం దాదాపు 40 కిలోమీటర్లు ఉంటుందన్నారు. ఎయిర్ పోర్ట్ టెర్మినల్ నుండి మొదలై, కొత్తగా ఏర్పడబోయే మెట్రో రైల్ డిపో పక్క నుండి ఎయిర్ పోర్ట్ సరిహద్దు గోడ వెంబడి ఎలివేటెడ్ మార్గంగా మన్సాన్ పల్లి రోడ్డు గుండా 5 కిలోమీటర్లు ముందుకు సాగాక, పెద్ద గొల్కొండ ఒఆర్ఆర్ ఎగ్జిట్‌కు చేరుతుందని వివరించారు. బహదూర్‌గుడాలో దాదాపు 1000 నుండి 1500 ఎకరాల ప్రభుత్వ భూమిని ఒక అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు బహదూర్ గుడా, పెద్ద గోల్కొండలో రెండు మెట్రో స్టేషన్లను అత్యంత ఆకర్షణీయంగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. పెద్ద గోల్కొండ ఒఆర్ఆర్ ఎగ్జిట్ నుండి తుక్కుగూడ ఎగ్జిట్ మీదుగా రావిర్యాల్ ఎగ్జిట్ వరకు దాదాపు 14 కిలోమీటర్ల పొడవున ఈ మెట్రో మార్గాన్ని ఎలివేటెడ్ మెట్రో మార్గంగా ఒఆర్ఆర్ లో మెట్రో రైల్‌కు కేటాయించిన భాగంలో తక్కువ ఎత్తులో నిర్మిస్తామని రెడ్డి తెలిపారు. రావిర్యాల్ ఎగ్జిట్ నుండి ఇప్పటికే నిర్మాణంలో ఉన్న స్కిల్స్ యూనివర్సిటీ వరకు దాదాపు 22 కిలోమీటర్లు కొంగరకలాన్, లేమూర్, తిమ్మాపూర్, రాచలూరు, గుమ్మడవెల్లి, పంజగుడా, మీర్ ఖాన్ పేట్ వరకు 100 మీటర్లు ( 328 అడుగులు) వెడల్పున నిర్మించే గ్రీన్ ఫీల్డ్ రహదారి మధ్యలో ఉన్న 22 మీటర్లను హెచ్‌ఎండిఎ (72 అడుగులు) మెట్రో రైల్‌కు కేటాయించిందని,ఈ రోడ్ మధ్య స్థలంలో మెట్రో రైల్ కారిడార్ 'ఎట్ గ్రేడ్' (భూ తలంపై) మెట్రోగా అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. ఈ విశాల మైన రోడ్ మధ్య లో అదే లెవెల్ లో మెట్రో రైల్ ఉంటే దానికి ఇరు వైపులా మూడు లేన్ల ప్రధాన రహదారి ఉంటుందని, మెట్రోను, ప్రధాన రహదారిగా విభజిస్తూ ఆకర్షణీయ మైన చెట్లను, గ్రీనరీని అభివృద్ధి చేస్తామని, ప్రధాన రహదారి కి ఇరువైపులా మరల రెండు సర్వీస్ రోడ్లను ఏర్పాటు చేస్తామని ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. నాడు ఒఆర్ఆర్ నిర్మిస్తున్న క్రమంలో భవిష్యత్‌లో నిర్మించే మెట్రోకు తగిన స్థలాన్ని కేటాయించాలని తాను చేసిన ప్రతిపాదనను అప్పటి సిఎం వైఎస్ఆర్‌ను అంగీకరించారని ఆయన గుర్తు చేశారు. ఒఆర్ఆర్ లో 20 మీటర్ల స్థలాన్ని మెట్రోకు కేటాయించారని, అప్పట్లో అనేక మంది ఒఆర్ఆర్, మెట్రో వంటి బృహత్ ప్రణాళికలు కేవలం కాగితలకే పరిమితమవుతాయని, అవి ఆచరణ సాధ్యం కాదని అపహాస్యం చేసినా, ఈ రోజు ఒఆర్ఆర్, మెట్రో రెండూ కూడా కార్యరూపం దాల్చాయని రెడ్డి చెప్పారు. వీటివల్ల హైదరాబాద్ ఒక అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చెంది, ప్రపంచంలోని ప్రముఖ కంపెనీలను, పెట్టుబడులను ఆకర్షిస్తోందన్నారు.

## హైదరాబాద్‌కు మరింత ఉజ్వల భవిష్యత్

ప్రస్తుత ప్రభుత్వం పెద్ద ఎత్తున అమలు చేస్తున్న మౌలిక వసతుల ప్రాజెక్టులతో హైదరాబాద్‌కు మరింత ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మెట్రో ఎండి ఎన్‌విఎస్ రెడ్డి అన్నారు. ప్రపంచంలో ప్రప్రథమంగా రూ.22 వేల కోట్లతో మెట్రో మొదటి దశను 69 కిలోమీటర్ల వరకు పిపిపి పద్ధతిన విజయవంతంగా పూర్తి చేశామని, అదే తరహాలో ప్రస్తుత ప్రణాళికలను కూడా సిఎం రేవంత్ రెడ్డి దార్శనికతతో కార్యరూపం దాల్చేలా హెచ్‌ఎండిఎ, టిజిఐఐసి, మెట్రో రైల్ సంస్థలు సంయుక్తంగా కృషి చేస్తాయని తెలిపారు.



